ఎట్టకేలకు సాకారం..



శివ్వారం వద్ద వంతెన నిర్మించనున్న ప్రాంతం

- గోదావరి నదిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి లైన్ క్లియర్
- షరతులతో కూడిన అనుమతులు జారీ
- అటవీశాఖ గ్రీన్ సిగ్నల్‌తో ముందుకు సాగనున్న పనులు
- డిసెంబరులో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

మంచిర్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా శివ్వారం-పెద్దపల్లి జిల్లా మంథని మధ్య గోదావరి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు కేంద్ర అటవీశాఖ కండిషనల్ క్లియరెన్స్ ఇచ్చింది. రెండు జిల్లాలను కలుపుతూ జైపూర్ మండలం శివ్వారం వద్ద ఉన్న గోదావరి నదిపై భారీ వంతెన ని ర్మాణానికి అనుమతులు వచ్చాయి. దాదాపు రూ. 125 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ వంతెన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబరు 4న పెద్దపల్లి జిల్లా పర్యటన సందర్భంగా శంుస్థాపన చేశారు. ఈ వంతెనను నిర్మాణంతో మంచిర్యాల- పెద్దపల్లి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకు ఏడాది క్రితమే ప్రణాళిక ప్రారంభంకాగా, ఎట్టకేలకు ఆ కల సాకారం కానుంది. శివ్వారం వద్ద గోదావరి నదిలో ఎల్. మడుగు వన్యప్రాణులు-మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉండటంతో బ్రిడ్జి నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్స్ రావడంపై కొంత సందిగ్ధత ఏర్పడింది. వంతెన నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అవసరమైన నిధులు మంజూరు, అటవీశాఖ అనుమతి కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి కృషి చేయడంతో ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది.

పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డితో ఢిల్లీ టూర్‌కు వెళ్లిన శ్రీధర్‌బాబు కేంద్ర అటవీ, పర్యా వరణ శాఖ మంత్రిని కలిసి ఫారెస్టు క్లియరెన్స్ కోసం వినతి పత్రాలను అందజేశారు. ఆ తర్వాత గోదా వరినదిపై వంతెన నిర్మాణానికి కదలి కలు రాగా, కేంద్ర అటవీశాఖ ద్వారా షరతులతో కూడిన అను మతులు లభించాయి.

మెరుగుపడనున్న రవాణా సౌకర్యం...

గోదావరినదిపై అందుబాటులోకి రానున్న అంతర్ జిల్లా వంతెనతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతో పా టు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రవాణా సౌక ర్యం మెరుగుపడనుంది. చెన్నూరు నుంచి మంథనికి వెళ్లాలంటే ఇంతకాలం గోదావరిఖని మీదుగా సుమా రు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేంది. అయి తే కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలో భాగంగా సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంతో కొంతమేర ఈ దూరం తగ్గింది. ప్రస్తుతం నిర్మించనున్న హైలెవల్ వంతెన అందుబాటులోకి వస్తే చెన్నూరు నుంచి మంథనికి 27 కిలోమీటర్లు, శివ్వారం నుంచి మంథనికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. ప్రాణహిత నదిపై అంతరాష్ట్ర వంతెన నిర్మాణంతో చెన్నూరు మీదుగా కాళేశ్వరం వరకు రవాణా సౌకర్యం కొంతమేర పడింది. ప్రస్తుతం జైపూర్ మండలం శి వ్వారం వద్ద నూతన వంతెన నిర్మాణానికి గ్రీన్‌సిగ్న ల్ రావడంతో మంచిర్యాల జిల్లా నుంచి నేరుగా మం థనికి వెళ్లేందుకు మార్గం సుగమం కానుంది. దీంతో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛ త్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలకు రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది.

షరతులతో కూడిన అనుమతులు జారీ...

గోదావరినదిలో వన్యప్రాణి-మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉండటంతో వంతెన నిర్మాణానికి కేంద్ర అటవీ శాఖ షరతులతో కూడిన అనుమతులను జారీ చేసింది. బ్రిడ్జి నిర్మాణం జరిగే స్థలంలో ఉన్న వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలని సూచించింది. నదిలో మొసళ్ల సంచారానికి ఎలాంటి ఇబ్బందులు..

(తరువాయి 7లో)

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు సన్మానం

గర్మిళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ పెంటరాజయ్య పదవీకాలం పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పెంటరాజయ్య మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా ప్రతికార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రం తిరుపతి, వడ్నాల రవీందర్, వేముల గురువయ్య, మాజీ కౌన్సిలర్ పల్ల రాజన్న, పెంట ప్రదీప్, రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న సీఐ ప్రమోద్‌రావు

గర్మిళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 4 నుంచి 7వరకు ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు మంగళవారం జిల్లాకబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రమోద్‌రావు చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్, క్రీడాకారులు జాన్సన్, దీపక్, సంజయ్, విజయ్, సాయి ప్రకాష్, రాజ్‌కు మార్, సాయికృష్ణ, దినకర్, మధుకర్, కార్తీక్, మేనేజర్ వర్మ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ స్టేట్ ఈసీ మెంబర్ కార్తీక్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్లతో మేలు

జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతీలాల్



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతీలాల్

దండేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాటమయ్య రక్షణ కిట్లలతో గీతన్నలకు ఎంతో మేలు జరుగుతుందని మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మంగళవారం దండేపల్లి మండలంలోని నర్సాపూర్, నాగసముద్రం, నంబాల, కన్నెపల్లిగ్రాల్లోని గీతకార్మికు లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గీతకార్మికులకు ఎలాంటి అపాయం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మేధావులతో చర్చించి. పలు రాష్ట్రాలలోని ఈ కిట్లలను పరిశీలించారని వివరిం చారు. చెట్లను ఎక్కే క్రమంలో కార్మికులు ప్రమాదాలబారిన పడితే కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం కార్మికులకు కాటమయ్య రక్షణకిట్లలను అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేశం అందజేశారు. కార్యక్రమంలో బీసీ వేల్ఫేర్ జిల్లా అధికారి అజ్మీర పురుషోత్తమంనాయక్, లక్షెట్టిపేట ఎక్సైజ్‌శాఖ సీఐ సమ్మయ్య, ఎస్సై మౌనిక, గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బండి రవిగౌడ్, వివిధగ్రామాల గీతకార్మికుల సంఘం నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తుందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు విజిత్‌రావు అన్నారు. దండేపల్లి పద్మశాలి సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లా డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగ్గిన బుద్ధి చెప్పాలన్నారు. 10ఏళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఎడాది ప్రజాపాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతి పక్షనేతలైన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపై కక్ష్య కట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీని వాస్, మాజీ వైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్, నెల్కివెంకటాపూర్ సహకారసంఘం చైర్మన్ కాసన గోట్టు లింగన్న, వైస్ చైర్మన్ అక్కుల రవీందర్, మాజీ ఉప సర్పంచు భూమన్న, మాజీ ఎంఎంసీ వైస్ చైర్మన్ రేణి శ్రీనివాస్, పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మున్సి పాలిటీని ప్రభుత్వం కార్పొరేషన్‌గా మార్చినందున మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు జీఐఎస్ ఆధారిత ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో టౌన్‌అండ్‌కంట్రీ ప్లానింగ్‌శాఖ హైద్రాబాద్ అదనపు సంచాలకులు రమేష్‌బాబు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ శివాజీతో కలిసి సంబంధిత అధి కారులకు శిక్ష ణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్‌సర్వే ద్వారా సంబం ధిత వివరాలను సేకరిస్తామన్నారు. కార్పొరేషన్ రూపకల్పనతో పాటు నివాసప్రాంతాలు, పారిశ్రామి కంగా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తిస్తామన్నారు. ముసాయిదా మాస్టర్‌ప్లాన్ రూపొం దించి ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదిస్తామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌కుమార్ దీపక్

అర్హత గల వారికి పరిహారం అందేలా చర్యలు

మంచిర్యాల వరంగల్ ఖమ్మం విజయవాడ జాతీయ రహదారి 163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన వారికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో జాతీయరహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధతులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హతగల వారు సంబంధిత పత్రాలు, బ్యాంకు పాసుపుస్తకాలతో సంప్రదిస్తే రికార్డులు పరిశీలించి పరిహారం చెల్లిస్తామన్నారు.

వెంకన్న చెంత సమస్యల చింత

- ఏటా లక్షల్లో ఆదాయం
- అభివృద్ధి శూన్యం
- వాగులో దారి సరిగా లేక భక్తుల ఇబ్బందులు

8

అటు కుక్కలు..ఇటు కోతులు

- ఇళ్లల్లోకి చొరబడి దాడి
- బెంబేలెత్తిపోతున్న జనం

7


ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీమారంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని వంద శాతానికి పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ మంగళవారం మంచిర్యాలలోని ఎల్ఐసీకీ కార్యాలయం ముందు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రవచించిన సంక్షేమరాజ్య భావనకు విరుద్ధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు నిధులనందిస్తున్న ఎల్ఐసీకి పోటీగా విదేశీకంపెనీలను నిలపడం దేశ ప్రయోజనాలకు భంగ కరమని పేర్కొన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశం, తిరుపతిరెడ్డి, రామదాసు, రమేష్ బాబు, సోచిన, చరణ్, హిమశ్రీ, సమ త్‌కుమార్, శ్రీని వాస్, రజాబాబురెడ్డి, మహేష్, తిరుపతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు లేని పాఠశాలలను రద్దు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జీవో నెంబర్ 1 ప్రకారం కనీస సౌకర్యాలు లేని పాఠశాలలను రద్దు చేయాలని వామపక్ష విద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాలలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠ శాలలకు అనుమతులు ఇవ్వవద్దని, కనీసం ఫైర్ సేఫ్టీ, మున్సిపల్ పర్మిషన్, ఆట స్థలంలేని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. అరకొర సౌకర్యాలతో పాఠ శాలలను ఏర్పాటు చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ జరిపి అనుమతులులేని, సౌకర్యాలు లేని పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీకాంత్, సన్నిగౌడ్, తిరుపతి, కార్తీక్ పాల్గొన్నారు.

ఘనంగా రథ సప్తమి..




స్వామివారిని సూర్య ప్రభ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

నస్పూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని నస్పూర్ కాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి మంగళవారం ఉదయం స్వామి వారిని సూర్య ప్రభ వాహనంపై ఊరేగింపు జరిపారు. ఆలయంలో ఉదయం ప్రధానార్చకులు వెంకట రమణాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయం పురవీధులల్లో సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసా దాలను స్వీకరించారు.

వైభవంగా శోభాయాత్ర

చెన్నూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాండురంగ రుక్మాబాయి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాండురంగ రుక్మాబాయిల ఉత్సవ విగ్రహాలతో మంగళవారం రాత్రి పట్టణ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. భాజభజంత్రీలు, మంగళవాయి ద్యాలతో మహిళల కోలాహలం నడుమ శోభాయాత్ర కన్నుల పండవగా జరిగింది. ఈ శోభాయాత్ర గోదావరి తీర హనుమాన్ ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన పాండురంగ రుక్మాబాయి ఆలయం వరకు కొనసాగింది. ఈ నెల 5నుంచి 7వరకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంతో పాటు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి : డీసీపీ

చెన్నూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదవాలని డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చెన్నూరు పట్టణంలోని పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఒత్తిడి వద్దు-ప్రాణం ముద్దు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధి రోహించడానికి చదువు తప్ప వేరే మార్గం లేదన్నారు.


విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. చిన్న చిన్న విషయాలకు ఆవేదనకు గురై కృంగిపోయి, ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ కనబర్చాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం సుమారు 250మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, అందజేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐలు రవీందర్, సుధాకర్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- రేపటి నుంచి గూడెంగుట్టలో ప్రత్యేక కార్యక్రమాలు
- 9న స్వామివారి కల్యాణోత్సవం - 12న మహాపౌర్ణమి జాతర..



శ్రీ రమా సహిత సత్యనారాయణ దేవతామూర్తులు



గూడెం గుట్టపై వెలసిన శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయం

దండేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దండెపల్లి మండలం గూడెం శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 6 నుంచి 13 వరకు శ్రీస్వామి వారి బ్రహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి 9 ఆదివారం సాయంత్రం 5 గంటలకు మాఘ శుద్ధ ద్వాదశి గోధూలి సుమూహూర్తాన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుపుతామని పేర్కొన్నారు. 12 బుధవారం నాడు మాఘ శుద్ధ పౌర్ణమి మహా జాతర జరుగుతుందన్నారు.

- ఈనెల 6 నుంచి 8 వరకు ఆలయంలో మఘ శుద్ధ నవమి పురస్కరించుకుని నిత్యవిధి ప్రాబోధిక ఆరగింపు, తీర్థ ప్రసాదగోష్టి, విశ్వకేశనారాధన, దీక్ష కంకణధారణ, నిరంతర సప్తాహ భజనలు ప్రారంభం,
- 9న మాఘశుద్ధ ద్వాదశి పురస్కరించుకోని నిత్యవిధి, ప్రాబోధిక ఆరగింపు, తీర్థప్రసాదగోష్టి, వాసుదేవా పుణ్యాహవచనం, విశ్వక్సేనారాధన, బుత్విగ్వరణమ్, అంకుర్పారణ, పటాధివాసం, ధ్వజారోహణము, సాయంత్రం 5గంటలకు గోధూళిక సముహూర్తమున స్వామివారి కల్యాణమహోత్సవం,
- 10న నిత్యవిధి ప్రాబోధిక ఆరగింపు, తీర్థప్రాసాదగోష్టి, హవనము, సాయంత్రం 6గంటలకు హోమము, బలిహారణము.
- 11న నిత్యవిధి, ప్రాబోధిక ఆరగింపు, తీర్థప్రాసాదగోష్టి, నవగ్రహ హోమం, పంచసూక్త హోమాలు, బలిహరణము, సాయంత్రం 6గంటలకు నిత్యహోమము, బలిహరణము.
- 12న నిత్యవిధి, ప్రాబోధిక ఆరగింపు, తీర్థప్రాసాద గోష్టి, హవనము, నిత్య హోమములు, జయాదిహోమం, శాంతిహోమము, మహపూర్ణాహంతి బలిహారణము, స్వామివారి సేవా ఉత్సవం,
- 13న స్వామివారి రథోత్సవం, సప్తాహ భజన, ఏకాంత సేవతో స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలు ముగిస్తాయి. స్వామివారి కల్యాణం ప్రతియేట మాఘమాసంలో స్వామివారి కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హాజరు కానున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా కల్యాణం వేడుకల పాల్గొనేందుకు గాను రూ. 500 చెల్లించి ర సీదు పొందాలన్నారు. కల్యాణం చేయు దంపతులకు ఒక ఉత్తరీయుము, కనుములు శేష వస్త్రాములతో పాటు లడ్డు ప్రసాదం అందజేయనట్లు ఈవో శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు గోవర్ధన రఘస్వామి, అర్చకులు, సిబ్బంది వెల్లడించారు.

ఇంటి పన్ను వసూళ్లు 40 శాతం పూర్తి

అంజద్‌పాషా, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఇంటి పన్నుల వసూలు ఎలా సాగుతోంది?

ఎంపీడీవో: ఇంటి పన్ను వసూలు మండల వ్యాప్తంగా 40 శాతం పూర్తిఅయింది. మార్చి 15లోగా వంద శాతం పూర్తిచేసేందుకు కృషి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: పారిశుధ్య పనుల నిర్వహణ ఎలా సాగుతోంది?

ఎంపీడీవో: ప్రతీరోజు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు నడుస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచి పారిశుధ్య సిబ్బంది పనులు చేపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలకేంద్రంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కదా?

ఎంపీడీవో: స్థలాన్ని గుర్తించాం. సీఎస్‌సీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేస్తాం. 70 శాతం ప్రభుత్వ నిధులు, 30 శాతం గ్రామపంచాయతీనిధులతో నిర్మిస్తాం.

ఆంధ్రజ్యోతి: కార్యదర్శుల పోస్టులు ఎక్కడ ఖాళీగా ఉన్నాయి?

ఎంపీడీవో: మండలంలోని గోయగాం, బోరిలాగ్‌గూడ, ముక్దాంగూడ, ఝరి, మోడి, సాకడ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా అధికారులకు జాబితా అందజేశాం. త్వరలోనే భర్తీ చేస్తాం.

- కెరమెరి

వేటగాళ్ల ఉచ్చులకు వన్యప్రాణులు బలి

- అటవీ జంతువులను వేటాడే క్రమంలో మేకలు, గొర్రెలు మృత్యువాత
- ఒక్కోసారి మనుషుల ప్రాణాలకూ ముప్పు



కోర్సిని సమీపంలో మృతి చెందిన గేదె(ఫైల్)

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అటవీ సమీప గ్రామాల్లో కొందరు వేటగాళ్ల తీరుతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కర్జెల్లి రేంజ్ పరిధిలో సమీప అటవీ గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో వేటగాళ్లు అమర్చుతున్న ఉచ్చులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొందరు వేటగాళ్లు రాత్రివేళల్లో అటవీ జంతువులను హతమార్చడం కోసం ఉచ్చులు, విద్యుత్ వైర్లు పెట్టి వారు ఇళ్లల్లోకి చేరుకుంటున్నారు. అటుగా వెళ్తున్న మూగజీవాలు మేత కోసం వెళ్తుండగా ఉచ్చులకు బలవుతున్నాయి. ఇటీవల చింతలమానేపల్లి మండలం కోర్సిని గ్రామానికి చెందిన వ్యక్తుల రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ సుమారుగా 60 వేల పైనే ఉంటుంది. దీంతో యజమానులు తీవ్రంగా నష్టపోయారు. సంబంధిత అధికారులు పరిశీలించి నిందితులపై చర్యలు తీసుకోవడంలో భాగంగా తహసీల్దార్ ఎదుట పలువురిని బైండోవర్ చేశారు. బెజ్జూర్ మండలంలో సైతం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బెజ్జూర్‌లో సైతం అధికారులు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ప్రతీ ఏడాది ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● గ్రామాల్లో అవగాహన కల్పిస్తే..

వేటగాళ్లు విద్యుత్ వైర్లు, ఉచ్చులు బిగించి అటవీ జంతువులను వేటాడే క్రమంలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. సమీప అటవీ ప్రాంతాల్లో చాలా మంది గిరిజనులు వివిధ పనుల కోసం అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న చేను, పొలం పనుల కోసం వెళ్తుంటారు. ఈక్రమంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి మనుషుల ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. వేటగాళ్లు అమర్చిన ఉచ్చులకు ప్రాణాలుపోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఈ విషయాలపై సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అటవీ ప్రాంతాల్లో ఉచ్చులు, విద్యుత్ వైర్లు అమర్చితే చర్యలు తప్పవని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య



పోశయ్య(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని బొందగూడకు చెందిన కొమురం పోశయ్య (55) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... కొమురం పోశయ్య తనకున్న 10 ఎకరాల భూమిలో ఈ ఏడాది పత్తిని సాగు చేశాడు. విత్తనాలు, ఎరువుల కోసం సుమారు రెండు లక్షల రూపాయలకు పైగా ఖర్చయింది. పత్తిపంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. పది ఎకరాల్లో వంద క్వింటాళ్లకుపైగా దిగుబడి రావాల్సి ఉండగా 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీంతో ప్రతీరోజు పోశయ్య దిగుబడి తగ్గిందని బాధపడుతూ ఉండేవాడు. దీనికి తోడు బ్యాంకులో రూ. 1.80 లక్షల రుణం, ట్రాక్టర్ ఈఎంఐ ఏడాదికి 1.60 లక్షల రూపాయలు కట్టాల్సి ఉంది. దిగుబడి తగ్గడంతో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనై ఇంట్లో ఎవరూలేని సమయంలో సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. అనంతరం గమనించిన కుటుంబ సభ్యులు అయనను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడు పోశయ్య కుమారుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

డ్రాపవుట్ పిల్లలకు తిరిగి బడిలో ప్రవేశం

సిర్పూర్(యు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగాపూర్‌లో బడి మానివేసిన ఐదుగురు పిల్లల్ని గుర్తించి, వారిని తిరిగి సిర్పూర్(యు) ఎస్సై రాంకృష్ణ మంగళవారం పాఠశాలలో ప్రవేశం కల్పించారు. ఎస్సై తన సిబ్బందితో రాగాపూర్ గ్రామాన్ని సందర్శించి బడి మానివేసిన ఐదుగురు పిల్లల్ని గుర్తించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు చదువుపై ఆవగాహన కల్పించారు. పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని, బాల్యంలో వారిని పనిలోకి పెడితే వారి బంగారు భవిష్యతు నాశనం అవుతుందన్నారు.

చదువుతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారికి సూచించారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపాస్తామని అంగీకరించారు. ఈ విషయంలో ఎస్సై రాంకృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి ఐదుగురు డ్రాపవుట్ పిల్లల్ని జైనూరు మండలంలోని పానాపటార్ ఆశ్రమోన్నత పాఠశాలలో చేర్పించారు.

వివాదాస్పదంగా మారిన భూ సర్వే

- అడ్డుకున్న స్థానికులు - రైతు ఆత్మహత్యాయత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



సర్వే పనులను అడ్డుకుంటున్న స్థానికులు

కాసిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ముత్యంపల్లి పంచాయతీ గురువాపూర్ శివారులో మంగళవారం రెవెన్యూ అధికారులు పోలీసు సహకారంతో చేపట్టిన భూ సర్వే వివాదాస్పదంగా మారింది. 74 సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు అధికారులు సర్వే చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని సర్వేను అడ్డుకున్నారు. 40 ఏళ్లుగా ఈ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులందరు భూమి వద్దకు చేరుకున్నారు. రైతు ఎగ్గి బాలయ్య భూమి కోల్పోతాననే భయంతో పురుగుల మందు తాగేందుకు యత్నించగా కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అడ్డుకుని పురుగు మందు డబ్బాను లాక్కుని పడేశాడు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ 74 సర్వే నెంబరులో ప్రభుత్వ భూమి ఉందని, కానీ కొందరు దళారులు అక్రమంగా పట్టా చేసుకుని భూమిని లాక్కనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 40 ఏళ్లుగా సాగులో ఉన్న తమకు అన్యాయం చేస్తే సహించబోమన్నారు. ప్రభుత్వ భూమిపై సమగ్ర సర్వే చేసి ఇన్నేళ్లుగా కాస్తులో ఉన్న తమకు న్యాయం చేయాలని స్థానికులు అధికారులను కోరారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వ పరంగా సర్వే చేసి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భోజన్న మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఎంత ఉందో గుర్తించేందుకే ప్రాథమికంగా సర్వే చేపట్టామని, ఎవరి పట్టా భూములను లాక్కోమని, సర్వేకు అందరు సహకరించాలని కోరారు.

గుండెపోటుతో అడిషనల్ ఎస్‌ఐ మృతి

జన్నారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండల అడిషనల్ ఎస్‌ఐ రాథోడ్ తానాజీ నాయక్(60) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ తానాజీ నాయక్ మంగళవారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో భార్య పుష్పలత, తోటి కానిస్టేబుళ్లు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాయక్ స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలోని ఏందా గ్రామం. మృతుడికి భార్య, కొడుకులు అమర్, వినాయక్ ఉన్నారు. స్వగ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో మంగళవారం పలు కిరణం షాప్‌లో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అంజన్న తనిఖీలు చేపట్టారు. శ్రీనివాస్ కిరాణ దుకాణంలో నినియోగదారుల నుంచి కొనుగోలు చేసిన రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని వాటిని సీజ్ చేసి సదరు వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు దండేపల్లి తహసీల్దార్ సంధ్యరాణి పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని దండేపల్లిలో రేషన్ 14 దుకాణంలో అప్పగించినట్లు ఆమె వెల్లడించారు. ఆర్ఐ భూమన్న పాల్గొన్నారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

దహెగాం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లకుంట గ్రామానికి చెందిన ముగ్గురిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బోర్లకుంట గ్రామంలో ఈ నెల 2న లోనారే సత్యనారాయణ, కుమరం సాయి, ప్రసాద్ అదేగ్రామానికి చెందిన కొంగ్రె తిరుపతి ఇంటి బయట నిలబడి ఉండగా ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని తిరుపతిని ముగ్గురు వ్యక్తులు కర్రతో కొట్టడంతో తలకు బలమైన గాయమైనట్లు పేర్కొన్నారు. భర్తపై కర్రలతో దాడి చేస్తుండగా భార్య హేమలత అడ్డుకోబోయిందన్నారు. హేమలత కుడి కన్నుకు స్వల్ప గాయమైనట్లు ఎస్సై వివరించారు. తిరుపతి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబ్బగూడెం శివారులో పెద్దపులి సంచారం



దుబ్బగూడెం శివారులో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కాసిపేట, ఫిబ్రవరి 4 (అంధ్రజ్యోతి): మూడురోజులుగా హడలెత్తిస్తున్న పెద్దపులి కదలికలు మంగళవారం దుబ్బగూడెం గ్రామ శివారులో కనిపించడంతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. మూడు రోజుల క్రితం కన్నాల, బుగ్గగూడెం, పెద్దనపల్లి అటవీ శివారు ప్రాంతాల్లో కనిపించిన పెద్దపులి ఒక్కసారిగా దుబ్బగూడం గ్రామ సమీపంలోకి రావడంతో అందరినీ కలవర పెడుతోంది. మంగళవారం ఉదయం మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్, బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్, మంచిర్యాల ఎఫ్ఆర్‌వో రత్నాకర్ దుబ్బగూడెం శివారు ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ మాట్లాడుతూ అటవీ శివారు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళల్లో మనుషులు ఒంటరిగా పంట పొలాలు, చేన్లలోకి వెళ్లరాదన్నారు. పశువుల కాపరులు, రైతులు, వ్యవసాయ కూలీలు అడవి లోకి వెళ్లరాదన్నారు. ఎవరుకూడా పులికి హానీ తలపెట్టవద్దన్నారు. ఎవరైనా ఉరులు, ఉచ్చులు బిగిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పులి కన్నాల అటవీ శివారుప్రాంతం నుంచి దుబ్బగూడెం, మామిడిగూడెం, గోండుగూడెం ప్రాంతాల అటవీ డివిజన్‌లోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, డీఆర్‌వోలు ప్రవీణ్‌నాయక్, గౌరి శంకర్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 4 (అంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం సాయికుంటలో పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాయికుంట శివారు చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఐదుగురిలో ముగ్గురు పారిపోగా మిగతా వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద నుంచి 5,070 రూపాయల నగదు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి ఒకరి మృతి

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 4 (అంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడికి సుమారు 25 సంవత్సరాలు ఉంటాయని, పూర్తి సమాచారం కోసం సెల్ 8712658596 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

పౌష్టికాహార లోపంపై అవగాహన కల్పించాలి

- డీఆర్‌డీవో దత్తారాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారాం

దహెగాం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపంపై అవగాహన కల్పించాలని, నివారణ చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో దత్తారాం అన్నారు. మంగళవారం దహెగాం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు గర్భందాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డ రెండు సంవత్సరాల వరకు ఆరోగ్యవంతంగా ఎదగాడానికి తీసుకునే పౌష్టిక ఆహారం గురించి వివరించారు. అలాగే తల్లీబిడ్డ వెయ్యి రోజులు తీసుకునే పౌష్టిుకంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల వద్ద గర్భిణులు తమ పేర్లు నమోదు చేయగానే పౌష్టిక ఆహారం లోపం నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ, ఏపీఎం చంద్రశేఖర్, మోహన్‌లాల్, హెచ్‌వీ పద్మ, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు పాల్గొన్నారు.

లింగాపూర్: చిన్నపిల్లలో పోషకాహార లోపం తగ్గించడం కోసం అధికారులు కృషి చేయాలని లింగాపూర్ ఐకేపీ ఏపీఎం తిరుపతి సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రలో ఐకేపీ వీఏవోలు, గ్రామపంచాయతి కార్యదర్శులు, వీవో సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో చిన్నపిల్లల్లో పోషక లోపాలను గుర్తించాలన్నారు. వారి ఎదుగుదలకు కావలసిన పోషకాలను అందించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో రామచందర్, ఏపీఎం జగదీష్, సీసీ ప్రదీప్, ఎంపీవో రజనీకాంత్‌రెడ్డి, ఏవో సంజయ్, పంచాయతికార్యదర్శులు పాల్గొన్నారు.

పత్తి వ్యాను బోల్తా



బోల్తాపడిన పత్తి వ్యాను

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎదుట మంగళవారం పత్తి వ్యాను బోల్తా పడింది. చింతలమానేపల్లి నుంచి ఆసిఫాబాద్ పట్టణంలోని జిన్నింగ్ మిల్లుకు పత్తి లోడుతో వస్తుండగా ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్ పోచయ్యను స్థానికులు బయటకు తీయగా ఎలాంటి గాయాలు కాలేదు.

ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలి



ఇన్‌చార్జి డీఈవో సన్మానిస్తున్న యుటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్‌తో పాటు రెమ్యూనరేషన్ చెల్లించాలని టీయూటీఎఫ్ నాయకులు మంగళవారం ఇన్‌చార్జి డీఈవో గమనీయల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సదాశివ్, వెంకట్‌రావు, శ్రీనివాస్, ప్రకాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ4 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట ఆర్టీసి బస్టాండ్‌లో ప్రయాణికులకు రోడ్డు భద్రతపై మంగళవారం అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ వార్డెన్ ఏడీసీ మొగిళి మాట్లాడుతూ ప్రయాణికులు బస్సు ఎక్కే సమయంలో క్యూ పద్ధతి పాటించాల సూచించారు. అంతే కాకుండా సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సులను ఎక్కవద్దన్నారు. ప్రమాదాలను నివాచించేందుకే ప్రయాణికులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణం చేసే సమయంలో సీట్ బెల్టు ధరించడం మర్చిపోవద్దన్నారు. ఆయన వెంట లక్షెట్టిపేట కంట్రోలర్ రవీందర్ ఉన్నారు.



సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

కాసిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరూ సమష్టి కృషి చేస్తే లక్ష్యాలను అధిగమించవచ్చని కాసిపేట-2వ గని మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మొదటి షిఫ్టులో ఆయన మాట్లాడారు. జనవరిలో 11వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన కార్మికులను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో కార్మికులు పనిచేస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. పనిస్థలాల్లో రక్షణసూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి చేయాలన్నారు. కాసిపేట-2వ గనిలో గైర్హాజరు శాతాన్ని తగ్గించి అధిక ఉత్పత్తికి పాటుపడుతూ గని అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో ఉత్సాహం నింపేందుకు ప్రోత్సాహక బహుమతులు



ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపి ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం సంస్థ ప్రత్యేక ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టామని సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఖైరిగూడ ఉపరిత గని ఆవరణలో ప్రత్యేక ప్రోత్సాహక పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన 37.50 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఇంచార్జి ప్రాజెక్టు ఇంజనీర్ కె.నరేష్, మేనేజర్ శంకర్, సేఫ్టీ అధికారి ఎ నారాయణ, డిప్యూటీ పీఎం వేణు, ఎఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు అవగాహనతో వ్యాధుల నివారణ

శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ



కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అవగాహన తోనే వ్యాధులను నివారించవచ్చని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. ఏరియా సింగరేణి వైద్యశాఖ ఆధ్వర్యంలో సింగరేణి అధికారుల క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన సదస్సు, నిర్ధారణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో వివిధ కారణాల వలన క్యాన్సర్ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రాథమిక స్థాయిలోనే వ్యాధి నిర్ధారణ జరిగితే చికిత్స సులువు అవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటే ఉద్యోగి, తద్వారా సంస్థకు మేలు జరుగుతుందన్నారు. క్యాన్సర్ నిర్ధారణ జరిగితే చికిత్స తీసుకోవాలని సూచించారు. సేవా అధ్యక్షురాలు మాలతి మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్, గైనకాలజిస్ట్ డాక్టర్ హరిత, ఏరియా వైద్యాధికారి డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఇన్‌చార్జి డీజీఎం (పర్సనల్) రాజేశ్వర్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ ప్రసన్న కుమార్, సీనియర్ పీవో కాంతారావు, సేవా కార్య దర్శి కొట్టె జ్యోతి, పిట్ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

మారుపేర్ల బాధితులకు న్యాయం చేయాలి



ఎస్‌వోటు జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మారుపేర్ల బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గుల్ల బాలాజీ అన్నారు. గోలేటిలో ప్రారంభమైన మారుపేర్ల బాధితుల పాదయాత్ర శ్రీరాంపూర్ జీఎం కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. అనంతరం ఎస్‌వోటు జీఎం సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. బాధితులకు సీఐటీయూ మద్దతు తెలిపింది. అనంతరం బాలాజీ మాట్లాడుతూ, గతంలో అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఆర్‌ఎల్‌సీ వద్ద యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నాయన్నారు. కానీ సింగరేణి వారికి ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఏళ్ల గడుస్తున్నా వారిని పట్టించుకువారు కరువయ్యారన్నారు. ఫలితంగా ఆయా కుటుంబాలు ఉద్యోగంలేక, ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా నాయకులు వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, శైల శ్రీనివా స్, వెంకట్‌రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

కార్మికులపై కేంద్రానికి కనికరం కరువు

శ్రీరాంపూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కార్మికులపై కేంద్ర ప్రభుత్వానికి కనికరం కరువైందని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. ఆర్‌కే 5 గనిపై మంగళవారం బాయిబాట కార్యక్రమం నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కార్మికులను విస్మరించారని అన్నారు. జాతీయ సంపదలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికవర్గానికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ అవార్డుగ్రహీత శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, ఉప ప్రధాన కార్యదర్శి పేరం రమేష్, కేంద్ర కార్యదర్శి మల్లారెడ్డి, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మహేందర్ రెడ్డి, ఏరియా కార్యదర్శి మోహన్, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అటు కుక్కలు.. ఇటు కోతులు..

లక్షెట్టిపేటలో గుంపులుగా ఊరకుక్కలు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో గ్రామసింహాలు(ఊరకుక్కలు) ప్రజలను గ జగజ వణికిస్తున్నాయి. ఏవాడలో చూసిన ఇవే స్వైర విహారం చేయ డంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతంలో ఇవి కొందరిపై దాడి చేసి గాయపరిచిన దాఖలు కూడా ఉన్నాయి. వారం రోజల నుంచి సుమారు 15మంది బాధితులు కుక్కకాటుకు గురై లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు రికార్డుల్లో నమోదు అయ్యింది. ఇలాగే అధికార యంత్రాంగం పట్టించుకోకుండా వదిలేస్తే రోజురోజుకూ శునకాల సంపద పెరగడమే కాకుండా ఇంకా ప్రమదాలు తీవ్ర స్థాయిలో జరిగే అవకాశాలు కనబడుతున్నాయి.

ఇళ్లలోకి వెళ్లి దాడి

బెంబేలెత్తిపోతున్న జనం

వారంలో 20కేసులు నమోదు

పట్టించుకోని అధికారులు

మున్సిపాలిటీ పరిధిలో కొన్ని చోట్ల వింత వింత వ్యాధులు సోకి ఊర కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటివలన ప్రజలు తీవ్ర భయాందోళనకు గురి అవుతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెల్లాలంటే కూడా ప్రజలు జంకుతున్నారు. ఎటు చూసినా కుక్కల గుంపులు దర్శనం ఇస్తున్నాయి.

పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు మెయిన్ రోడ్డుపై రాత్రి సమయంలో శునకాలు గుంపులు గుంపులుగా ఉంటూ బైక్‌లపై అదేవిధంగా కాలి నడకన వెల్తున్న వారిపై దాడిచేస్తున్నాయి. పనులు ముగించుకుని రాత్రి సమయంలో ఇండ్లకు వెళ్లే వారు చేతులో కట్టెకానీ రాయి కానీ లేకుండా వెళ్లలేకపోతున్నారు. కుక్కకాటుకు ప్రభుత్వ ఆసుపత్రిలో మందు ఉన్నప్పటికీ రోగాల పాలైన శునకాలు దాడి చేస్తే మాత్రం మనిషి ప్రాణానికే ప్రమాదం అంటున్నారు వైద్యులు.

రెబిస్ వ్యాధితో భయం

కుక్కలు మనుషలను కరిస్తే రెబీస్ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వివిధ వ్యాధులతో ఊళ్లో సంచరిస్తున్న కుక్కలు కరిస్తే రెబీస్ వ్యాధి ఎక్కడ సోకుతుందో అని ప్రజల్లో భయం పుట్టుకుంది. శునకాల బాధ పట్టణంలోనే కాకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో తీవ్రమవుతోంది. అధికారులు స్పందించి శునకాల భారి నుంచి ప్రజలకు విముక్తి కలిగేలా చూడాలి.

జైపూర్‌లో తీవ్రమవుతున్న కోతుల బెడద

గుంపులు గుంపులుగా సంచారం

జైపూర్ : మండల కేంద్రంలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇంటి మేడపైకి వెళ్లాలంటేనే మహిళలు భయాందోళన చెందుతున్నారు. ఇంటి ఆవరణలో కూర్చోవాలంటే జంకుతున్నారు. ఆదమరిచి ఇంటి తలుపులు తెరిస్తే ఇంట్లోకి దూరి సామగ్రిని చిందర వందర చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

కోతుల భయంతో ఇంట్లోనే..

మండల కేంద్రంలో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఎదురు తిరిగిన వారిపై దాడి చేస్తున్నాయి. డాబాలపై బట్టలు ఆరేయడానికి సైతం ప్రజలు జంకుతున్నారు. ఎవరైనా కోతులను బెదిరిస్తే మీదకు వచ్చి దాడి చేస్తున్నాయి. కోతుల బయానికి విద్యార్థులు, వృద్ధులు బయటకు కూడా రాలేక ఇంట్లోనే తలుపులు పెట్టుకుని ఉండిపోవాల్సిన పరిస్థితులు ఎదువుతున్నాయి. ఇప్పటికే కోతుల దాడిలో చాలా మంది ప్రజలు గాయపడ్డారు.



కోతులను తరలించాలి

ఎం. లక్ష్మణ్, జైపూర్

కోతుల సంచారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యా ర్థులు, వృద్ధులు, పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు కోతులు ఎక్కడ దాడి చేస్తాయేమోనని భయపడుతున్నారు. ఎప్పుడు ఏ పక్క నుంచి వచ్చి దాడి చేస్తాయో తెలియడం లేదు. ఇళ్లలోకి చొరబడి వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నాయి. కోతులను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించారు. కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలి.

పెరుగుతున్న కోతుల సంఖ్య

కన్నా కోతుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. గతంలో పదుల సంఖ్యలో ఉన్న కోతులు ప్రస్థుతం వందల సంఖ్యలో పెరిగాయి. చిన్న పిల్లలతో పాటు పెద్ద పెద్ద కోతులు మండల కేంద్రంతో సంచరిస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వెంటపడి కరుస్తున్నాయి

తిరుపతి, కోర్టు ఏరియా. లక్షెట్టిపేట

వాడలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. భయట నడవాలంటే భయం వేస్తుంది. మొన్నటికి మొన్న రాత్రి సమయంలో అందరం పడుకున్నాక ప్రహరీ గోడ దూకి వచ్చి మా ఇంట్లో పెంచుకునే కుక్క పై దాడి చేసి చంపేసాయి. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకు పోయిన కూడా పట్టించుకోవడం లేదు. పిల్లలు తినుబండారాలతో బయటకు వస్తే చాలు వాళ్లపై దాడి చేసి మరి లాక్కు పోతున్నాయి.



చేతిలో కర్ర లేనిదే ఇల్లు చేరలేం...

దాసరి వెంకటేష్, అంకతివాడ. లక్షెట్టిపేట

ప్రతీ రోజు పని ముగించుకుని ఇంటికి రాత్రి సమయంలో కాలిన డకన వెళ్తాం. చేతిలో కర్రో రాయో లేనిదే ఇంటికి చేరలేకపోతున్నం. చీకట్లో నడుచుకుంటూ వెళితే శునకాలు గుంపులు గుంపులుగా వెం ట పడుతున్నాయి. వాటిని తరిమి కొడుతూ ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది. రాత్రిళ్లు కూడా వాటి అరుపులు ఏడ్పులకు నిద్ర కూడా పట్టడం లేదు.



చర్యలు చేపడతాం..: మారుతీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, లక్షెట్టిపేట

పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైన విషయం మాదృష్టికి వచ్చింది. శునకాలు గుంపులుగా సంచరిస్తున్న ప్రాంతాల్లో చిన్న పిల్లలను ఒంటరిగా పంపించకండి. చికెన్, మటన్ వ్యాపారులు వాటి వ్యర్థాలను దూరంగా డంపు యార్డుల్లో పడేయండి. తొందరలోనే ప్రత్యేక బృందాలను పిలిపించి మన ప్రాంతంలో ఊర కుక్కల బెడద లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం.



పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలి టీని కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలను కమిషనర్ రాజలింగును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ ఆవరణలోని నర్సరీని పరిశీలించారు. అనంతరం చతలాపూర్‌లోని డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులను వార్డుల్లో ముమ్మరంగా నిర్వహించాలన్నారు. పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసు వెనక్కి తీసుకోవాలి

భీమారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామిపై పెట్టిన అక్రమకేసును వెనక్కి తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఐఎన్‌టీయూసీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నక్క రాజన్న, గౌరవాధ్యక్షుడు ఈద లింగయ్యలు పేర్కొన్నారు. మంగళ వారం భీమారంలో వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి పని ప్రదేశానికి వెళ్లి జాగ్రత్తలు చెబుతుండగా మట్టి పనులు చేస్తున్న తల్లి కూతుళ్లపై ప్రమాదశాత్తూ బండలు పడి మృతి చెం దారని తెలిపారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన తప్పేంటేని ప్రశ్నించారు. వారి మృతికి ఫీల్డ్ అసిస్టెంట్‌ను బాధ్యున్ని చే యడం సరైంది కాదన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్‌ను మంగళవారం మందమర్రి మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గిర్నాటి జనార్ధన్, సీనియర్‌నాయకులు డీవీ దీక్షితులు, సంజీవరావు, మల్లేష్, మల్లికార్జున్‌గౌడ్‌‌ాల్గొన్నారు.

శాలివాహన కార్మికుల బెనిఫిట్స్ సత్వరమే చెల్లించాలి

కార్మిక సంఘం నాయకులు కుంటాల శంకర్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికుల బెనిఫిట్స్ సత్వరమే చెల్లించాలని కార్మిక సంఘం నాయకులు కుంటాల శంకర్ అన్నారు. మంగళవారం వరంగల్ లేబర్ కమిషనర్‌కు మంగళవారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల బెనిఫిట్స్ సత్వరమే చెల్లించాలని వరంగల్ జాయింట్ లేబర్ కమిషన్ యాజమాన్యాన్ని ఆదే శించిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సోమవారం జాయింట్ మీటింగ్‌ను కంపెనీ హెచ్‌ఆర్‌లు మాణిక్యం, విశ్వనాథ్, కార్మికులతో కలిసి నిర్వహించారన్నారు. కంపెనీ మూసివేసి 26 నెలలు గడుస్తున్న కార్మికులకు కార్మిక చట్టం ప్రకారం రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరి కాదన్నారు. వెంటనే బెనిఫిట్స్ ఇవ్వాలని జాయింట్ లేబర్ కమిషనర్ యాజమాన్యానికి ఆదేశించారు.. రెండు వారాలు సమయం కోరిన యాజమాన్యం ఆలోపు చెల్లించని పక్షంలో కంపెనీకి సంబంధించిన భూములలో గుడిసెలు వేసుకొని కార్మికుల హక్కులను సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పవర్ ప్లాంట్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు మద్దూరి రాజు యాదవ్, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి నిమ్మరాజుల సత్యం, ఉపాధ్యక్షులు సగ్గుర్తి ఆనందరావు, కోశాధికారి పెంట సత్యం, రావుల తిరుపతి, కాయితి బుచ్చయ్య, సిరిపురం తిరుపతి, ఇసా రపు శంకర్, గెల్లు ఎల్లయ్య, కాయితి సురేష్‌లు పాల్గొన్నారు.



వరంగల్ లేబర్ జాయింట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

'కోర్టు పరిధిలో భూ వివాదం పరిష్కరించుకుంటాం'

భీమారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కోర్టు పరిధిలో భూ వివాదం కేసును పరిష్కరించుకుం టామని భీమారం గ్రామానికి చెందిన రాజం అతని కుమారుడు రేషవేని లక్ష్మణ్ భూ యాజమానులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో నిర్వహించిన స మావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 651లోని భూమిని మెండ రాజం అక్రమంగా పట్టా చేసుకుని జలంపెల్లి భాను అనే వ్యక్తికి అమ్మాడని, ఈ విషయంపై తాము కోర్టులో ఫిర్యాదు చేశామని, అలాగే జలంపల్లి బాను సైతం కోర్టులో ఫిర్యాదు చేశారని తెలిపారు. కోర్టు పరిధిలో కేసు పరిష్కారం కాకముందే భూమిమోకా మీదకు వచ్చి ఆదివారం మధ్యాహ్నం చదును చేస్తుండగా తాము పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఇరువురిని సోమవారం ఉదయం స్థానిక ఎస్ఐ శ్వేత పిలిపించి ఇరు వర్గాల భూమి పత్రాలను పరిశీలించి న్యాయం చేస్తామని తెలపడంతో పోలీస్‌స్టేష న్‌కు వచ్చామన్నారు. పోలీస్‌స్టేషన్‌లో జలంపల్లి భాను అ తని కుమారుడు, వారి స్నేహతులు మరో ముగ్గురు రేషవేణి లక్ష్మణ్‌ను భయభ్రాంతులకు గురి చేసి బెదిరించారన్నారు. ఎస్ఐ సైతం ఏకపక్ష నిర్ణయంగా మాట్లాడారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ శ్వేతను వివరణ కోరగా భూమి తగాదా విషయమై ఇరు వర్గా వారిని విచారించడానికి తాను పోలీస్ స్టేషన్‌కు పిలిపించానని, ఇరు వర్గాల వద్ద ఉన్న పత్రాల ఆధారంగా వివాదం పరిష్కారం అవుతుం దని వివరించానని సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు పేర్కొన్నారు.

నియామకం



సుధీర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాండూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తాండూర్ మండలం గంపలపల్లి గ్రామానికి చెందిన నౌనూరి సుధీర్‌గౌడ్ నియమితులయ్యారు. మంగళవారం తాండూర్‌లోని ఐబీ కేంద్రంలో బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ ఆధ్వర్యంలో సుధీర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యవర్గ సభ్యులు కేశెట్టి విజయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు దుర్గచరణ్, శ్రీనివాస్, నాయకులు విగ్నేష్, శంకర్, సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువును మార్చ్ 31వ తేదీ వరకు పొడగించినట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాస్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు.


విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి : ఎస్ఈ

గర్మిళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ పర్యవేక్షణ అధికారి గంగాధర్ తెలిపారు. మంగళవారం హైటెక్‌సిటీలోని విద్యుత్ భవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయంలే కుండా ఇంటర్ లింకింగ్ లైన్‌లు, అదనపుట్రాన్స్‌పార్మర్‌ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని, ట్రాన్స్‌పార్మర్ గద్దెలను ఎత్తుగా పెంచాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సమస్యలు లేకుండా రైతులకు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈ నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డివిజనల్ ఇంజనీర్‌లు కైసర్, రాజన్న, ఏడీఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

భీమిని, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) ఫిబ్రవరి 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో గంగామోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. కన్నెపల్లి, భీమిని మండలాల వైద్య సిబ్బందికి, ఆశాకార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడారు. అర్హులైన వారందరికి అల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయాలన్నారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవడంతో నులిపురుగులు దరిచేరవన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఈ నెల 7 లోగా పాఠశాలలు, హాస్టళ్లకు మందుగోళీలు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అర్చన, డీటీ గోవర్ధన్, సీహెచ్‌వో జలపతి, హెచ్‌వీ ఇందిర, హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆయాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీడీవో గంగామోహన్, మెడికల్ ఆఫీసర్ అర్చన

గుండెపోటును గుర్తించిన వెంటనే ఆస్పత్రికి చేరుకోవాలి

గర్మిళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు సమయానికి చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కావచ్చని, హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవడం ఎంతో ముఖ్యమని డాక్టర్ రాజేశ్ భుర్కుండే అన్నారు. జిల్లా కేంద్రంలోని టచ్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్‌లో వైద్యులు గుండెనొప్పితో వచ్చిన వ్యక్తికి అధునాతన వైద్య పరికరాలతో కార్డియోలజిస్టు డాక్టర్ రాజేశ్ భుర్కుండే ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడారు. ఆయన మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ వచ్చిన వారిలో 50 శాతం మంది ఆసుపత్రికి చేరుకోకముందే మరణిస్తున్నార న్నారు. ఛాతిలో నొప్పి వచ్చిన గంటలోపు ఆసు పత్రికి చేరితే ప్రాణాలను రక్షించే అవకాశాలుంటాయన్నారు. సమావేశంలో డాక్టర్‌లు వికాస్, రాజ్‌పాల్, రాజేష్, అతర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు సాకారం...

(5వ పేజీ తరువాయి)

కలగకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నిర్మాణ పనులు చేపట్టాలని ఆటవీశాఖ నిబంధనలు విధించింది. ఆ ప్రత్యేక సమయానికి ముందు, తరువాత మొసళ్లు సేదదీరేందుకు ఒడ్డుకు వచ్చే అవకాశం ఉండటం, వాటి సంచారానికి భంగం కలిగే అవకావం ఉంటంతో పై నిబంధనలను పరిగణలోకి తీసుకోవాలని ఊచించింది. వాటిని అతిక్రమిస్తే వన్య ప్రాణి చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని వెల్లడించింది.

వ్యాపార,వాణిజ్య వర్గాలకు ఊరట...

గోదావరి నదిపై అంతర్‌జిల్లా వంతెన నిర్మాణం పూర్తయితే రెండు జిల్లాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మరింతగా మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. మంథని నియోజకవర్గంలోని వ్యాపారులు, ప్రజలు పెద్దపల్లి మీదుగా కరీంనగర్ లాంటి ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం వెళ్లేవారు. వంతెన పూర్తయితే శివ్వారం మీదుగా నేరుగా మంచిర్యాలకు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. పైగా దూరభారం కూడా గణనీయంగా తగ్గనుంది. తద్వారా రెండు జిల్లాలకు చెందిన వ్యాపారాలు పుంజుకునే అవకాశాలు ఉన్నాయి.

వర్గీకరణ చేయకుంటే ప్రభుత్వంపై యుద్ధమే.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ

దండేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధమే అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళీకృష్ణ అన్నారు. మంగళవారం దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం నాయకులతో కలిసి లక్ష డప్పులు, వేల గొంతుల ప్రచార పోస్టర్‌లను వారు ఆవిష్కరించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పుల మహా ప్రదర్శన ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంతెన నవీన్, సంఘం నాయకులు లింగంపల్లి బాపు, అంజన్న, సుబాష్, శ్రీనివాస్, వినయ్, నరేష్, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

హాజీపూర్ : ఈ నెల 7న హైద్రాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమం పోస్టర్లను మంగళవారం హాజీపూర్ మం డల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఎమ్మా ర్పీఎస్ నాయకులు, మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్యాల బాపు మాదిగ, సీపెల్లి మొగిలి మాదిగ, లక్ష్మణ్ మాదిగ, లింగయ్య మాదిగ, వెంకటేష్ మాదిగ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెండ వెంకటాపూర్, పోతపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరిగోడ నిర్మాణం పనులను మంగళవారం డీఆర్‌డీవో పరిశీలించారు. సుస్థిర ఆస్తుల కల్పన ఈజీఎస్‌లో కూడా సాధ్యం అవుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం విద్య వైద్యం అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. అందులో భాగంగా విద్యా రంగంపై ఈజీఎస్ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. నిర్ణీత సమయంలో జెండ వెంకటాపూర్ గ్రామంలో పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ పెట్టెం రవిని అభినందించి సన్మానించారు. ఆయన వెంట ఎంపీడీవో సరోజ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వేణుగోపాల్, ఈసీ స్వామి, పంచాయతీ సెక్రటరీ హరికృష్ణ, రాజశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ బూసరాజు రాజన్న ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

తాండూరు సీఐ కుమారస్వామి

భీమిని, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాలతో నేరాలను పూర్తి స్థాయిలో అదుపు చేయవచ్చని తాండూరు సీఐ కుమారస్వామి అన్నారు. మండలంలోని కేస్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం సీఐ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిఘా నేత్రాలు నేరాలు తగ్గించడంలో కీలకంగా మారాయన్నారు. తప్పు చేసిన వారు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకునే వీలు లేదన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. మిగతా గ్రామాలు సైతం కేస్లాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో రాణించేవారిని ప్రోత్సహిస్తామన్నారు. ఆయనతో పాటు ఎస్సై విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మాట్లాడుతున్న బీజేపీ పట్టణాధ్యక్షురాలు దార కళ్యాణి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు సంతోషాన్నిచ్చే విధంగా ఆదాయ పన్ను పరిమితి 12 లక్షలకు పెంచడాన్ని హర్షిస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణాధ్యక్షురాలు దార కళ్యాణి మంగళవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ 140 కోట్ల మంది ప్రజలకు ఆమోద యోగ్యమైన బడ్జెట్ అని పేర్కొన్నారు. రూ. 12 లక్షల వరకు ఆదాయ పన్ను రాయితీ కల్పించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచర్ల సంతోష్, మద్దెర్ల శ్రీనివాస్, వడ్నాల స్వామి, ప్రభాకర్, సుమలత, ప్రసన్న, లావణ్య, రాము, స్వర్ణలత, శ్రీనివాస్, గౌడ్ షేక్, సూర్యతేజ, చంద్రమౌళి పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలి

కోటపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలు గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మహిళ సాధికారత కేంద్రం సమన్వయకర్త సౌజన్య పేర్కొన్నారు బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లింగ నిర్ధారణ నేరమని పేర్కొన్నారు. మహిళలు, బాలికలకు ఏదైనా సమస్యలు ఎదరైనప్పుడు 181, 1098లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జండర్ స్పెషలిస్టు విజయ, మెడికల్ ఆఫీసర్ అరుణశ్రీ, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త సౌజన్య



గురుకుల ప్రవేశానికి గడువు పెంపు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు తేదీని ఈ నెల 6 వరకు పొడిగించినట్లు జిల్లా సమన్వయకర్త డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1తో గడువు ముగియగా సెలవులు రావడంతో 6వ తేదీ వరకు పొడగించామని వివరించారు.

అటవీ శాఖాధికారికి సన్మానం

కెరమెరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కెరమెరి అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న రామయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఆయనకు ఇటీవల గ్రూప్-4లో ఉద్యోగం రావడంతో కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. ఈ మేరకు ఆయనను అటవీ రేంజ్ అధికారి మజారోద్దీన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

పంటల డిజిటల్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

దహెగాం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ పంట సర్వేను పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గిరివెల్లి, దహెగాం డిజిటల్ పంట సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు విధిగా యాసంగి సాగు పంటల వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఏఈవోలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, సుష్మిత రైతులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు- వేల గొంతుల కార్యక్రమానికి పెద్ద సంఖ్యల పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు చంద్రగిరి సుదర్శణ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం డప్పులతో ప్రదర్శణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి రవీందర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న చెంత సమస్యల చింత

వరద ఉధృతికి కొట్టుకుపోయిన కల్వర్టు


ఏటా లక్షల్లో ఆదాయం అభివృద్ధి శూన్యం

వాగులో దారి సరిగా లేక భక్తుల ఇబ్బందులు

రెబ్బెన, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కుమురం భీం జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్ శివారులో చారిత్రప్రాధాన్యం గల బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ప్రతీ సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గంగాపూర్ ఆలయంలో మూడురోజుల పాటు జాతరను నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా భక్తులు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు సమర్పించుకోవటంతో పాటు కట్నకానుకలను హుండీలో వేస్తుంటారు. ఏటా జాతర వేలం ద్వారా, హుండీ ద్వారా లక్షల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ ఆలయ అభివృద్ధి ఏ మాత్రం జరగటం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధిపై అధికార యంత్రంగానికి ఏ మాత్రం పట్టింపులేదని విమర్శలు విన్పిస్తున్నాయి.

చారిత్రక ప్రాధాన్యం గల ఆలయం కావటంతో ఇక్కడ ప్రతీ శనివారం, సోమవారం అన్నదాన కార్యక్రమాలను కూడా భక్తులు చేపడుతున్నారు. మిగతా రోజుల్లో కూడా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. అయితే ఆలయం గుట్టపై ఉండటంతో పాటు ఆలయం ముందు గంగాపూర్ వాగు ప్రవహిస్తోంది. గతంలో రాకపోకలు సరిగా ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బందులు రాలేదు. నాలుగు సంవత్సరాల క్రితం ఆలయానికి కొద్దిదూరంలో గంగాపూర్ చెక్ డ్యాంను నిర్మించారు.

వాగులోంచి వెళుతున్న భక్తులు


దీంతో వర్షాకాలం చెక్ డ్యాం నుంచి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో భక్తులు వాగు దాటి స్వామివారి దర్శనానికి వెళ్లటానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా సంవత్సరం పొడువునా వాగు ప్రవహిస్తుండటంతో చిన్నపిల్లలు వృద్ధులు అందులోంచి నడిచివెళ్లటానికి ఇబ్బందికరంగా ఉందనే ఉద్దేశంతో ఆలయ కమిటీ వారు రెండు సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మాణం చేపట్టారు. వరద తాకిడికి కొట్టుకపోవటంతో భక్తులు ఇబ్బందులు అలాగే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జాతరకు వచ్చే వారి కోసం సరైన దారిని ఏర్పాటు చేయాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.

కలగానే మిగిలిన కల్యాణ మండపం..

జాతర సందర్భంగా బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ మహోత్సవం జరిపించేందుకు ఆలయం వద్ద ప్రతీ సంవత్సరం తాత్కాలిక టెంట్లు వేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే దీనికి కల్యాణ మండపం నిర్మించాలనే ఉద్దేశంతో గతంలో రూ. 25 లక్షల నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దాత సహకారంతో సిమెంటు పనులను మాత్రం పూర్తి చేశారు. అలాగే రెబ్బెన మండలం కేంద్రం నుంచి గంగాపూర్ ఆలయం వరకు సింగిల్ రోడ్డు ఉండటంతో భక్తులు రాకపోకల సందర్భంగా తీవ్రఇబ్బందులు ఎదుర్కొవటం జరుగుతుంది. ఇట్టి రోడ్డుకు నిధులను మంజూరు చేయించి డబుల్ రోడ్డుగా మారిస్తే జాతర సందర్భంగా రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం ఉండదు.

సౌకర్యాలు మెరుగు పర్చాలి..
జుమిడి సౌందర్య, మాజీ ఎంపీపీ



గంగాపూర్ జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాను మెరుగుపర్చాలి. ప్రతీ సంవత్సరం మూడు రోజుల పాటు జరిగే జాతరకు కుమురం భీం జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయి. రెబ్బెన-గంగాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తే రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.


గంగాపూర్ ఆలయం

కన్నులపండువగా బాలేశ్వరస్వామి జాతర

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- జనసంద్రంగా మారిన పెద్దవాగు ప్రాంతం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగు నది తీరాన కొలువుదీరిన బాలేశ్వరస్వామి జాతర మంగళవారం కన్నుల పండువగా జరిగింది. రథసప్తమిని పురస్కరించుకుని ప్రతీ ఏడాది ఆలయ సమీపంలోని పెద్దవాగు నది తీరాన జాతర జరుగుతుంది. ఉదయం నుంచి ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీధర్ శర్మ, అజయ్‌శర్మ, బాలేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం ఐదు గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. సాయంత్రం స్వామి వారి విగ్రహాన్ని ఊరేగించి రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ జాతరకు ఆసిఫాబాద్ మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలు అయిన వాంకిడి, రెబ్బెన, తిర్యాణి, కెరమెరి మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తుల తాకిడితో పెద్దవాగు నదీతీరం భక్త జనసంద్రంగా మారింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, న్యాయమూర్తి అనంతలక్ష్మి, ఏఎస్పీ శ్రీరామోజు చిత్తరంజన్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఎస్సైలు రాజేశ్వర్, అంజయ్య, ప్రశాంత్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు చిలువేరి వెంకన్న, గాదవేణి మల్లేష్, నాయకులు సింగాడే అశోక్, జీవన్, ఆలయ కమిటీ సభ్యులు ఆమ్టే అనూప్, మనోజ్‌కుమార్, తాటిపల్లి దిలీప్, బలవంత్, అభయ్ కుమార్, కొలిపాక వేణుగోపాల్, రాపర్తి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


జాతరకు పోటెత్తిన భక్త జనం


రథాన్ని లాగుతున్న భక్తులు


పూజలు చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఉపాధ్యాయులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న ఉపాధ్యాయులు

బెజ్జూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పీజీ హెచ్‌ఎం సునీత, అదే పాఠశాలలో పని చేస్తున్న హిందీ స్కూల్ అసిస్టెంట్ ముకుందరావులకు గౌరవ డాక్టరేట్ దక్కింది. ఇద్దరికి గత నెల 31న ఢిల్లీలో వెల్ ఎడ్యుకేషన్ అండ్ పీస్ కౌన్సిల్ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. విద్యారంగంలో చేసిన సేవా కార్యక్రమాలకు డాక్టరేట్ దక్కడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు సునీతను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణటీచర్స్ యూనియన్ నాయకులు కమర్, సీఆర్పీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పుణేష్, శ్యాం, సంతోష్, రమేష్‌బాబు, ఇందిరా, విష్ణు పాల్గొన్నారు.

పాము కాటుతో ఎద్దు మృతి

జైనూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డెసర్ గ్రామశివారులో కుంరం నాందేవ్ అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం పాముకాటుతో మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు 50 వేల రుపాయలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు. నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి పెద్దల కైలాస్ ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అతని నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడికి ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. వారికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

దహెగాం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలో మంగళవారం బాధితులకు బీజేపీ నాయకుడు ధనుంజయ్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ గౌడ్, జయలక్ష్మి, సత్యనారాయణ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 04(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. మంగళవారం జిల్లాలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యహ్న భోజన పథకం, విద్యార్థులు ఉపాధ్యాయుల హాజరు అంశాలపై వివరాలు తెలుసుకునేందుకు దాదాపు 40 పాఠశాలల ఉపాధ్యాయులకు వీడియో కాల్‌చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని మొగడ్‌దగడ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గూరిడిపేట గిరిజన సంక్షేమ పాఠశాలలో పని చేస్తున్న సీఆర్టీ కె శారద గైరుహాజరు కావడంపై ఎస్సీఆర్పీ పోచం, హెచ్‌ఎం ఆశోక్‌ల వివరణ కొరగా ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైరుహాజరు అయ్యారని తెలుపడంతో సదరు సీఆర్టీని విధుల నుంచి తొలగించాలని పీవో ఆదేశించారు.

కొత్త ఓటర్లపై అభ్యంతరాల పరిశీలన

- రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవోల సమావేశం


వాంకిడి, రెబ్బెనలో మాట్లాడుతున్న ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, శంకరమ్మ

సిర్పూర్(టి), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా నమోదు అయిన ఓటరు జాబితాపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. కొత్త ఓటర్ల జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఎన్నికలు జరిగే వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లావణ్య, కాంగ్రెస్ నాయకులు సోహెల్ అహ్మద్, అబ్దుల్ అకీల్,శ్యాంరావు, అశోక్‌తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మూడు నెలల్లో నమోదైన ఓటరు లిస్టును మంగళవారం ఎంపీడీవో శంకరమ్మ ప్రకటించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓటరు లిస్టు వివరాలను వెల్లడించారు. గతంలో తుది జాబితా తయారు చేయగా, వచ్చిన అభ్యంతరాలను సరి చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు లావుడ్య రమేష్, పోటు శ్రీధర్ రెడ్డి, రాంబాబు, దుర్గం దేవాజీ, మెడెం సుదర్శన్ గౌడ్, జయరాం, వెంకటేశం చారి, లెండుగురే గంటుమేర తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ అనుబంధ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలను నిర్వ హించడం కోసం మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఓటరు జాబితాపై వివరించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వాంకిడి (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వార్డు వార్డుల మార్పులు, చేర్పులు చేసిన సప్లమెటరీ ఓటరు లిస్టుపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో ఏమైనా సవరణలు తమ ఉంటే దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సూచించారు. సీపీఐ నాయకులు గోపినాథ్, కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్, టీడీపీ నాయకుడు విదవలత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు: కలెక్టర్


గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే నాణ్యమైన విద్యాబోధన అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం మాలన్‌గొందిలో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ను ఆకస్మికంగా సందర్శించి తరగతిగదులు, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందించేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల కు శుద్ధమైన తాగునీటిని అందించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలతో త్వర గా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా తడి పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, నర్సరీల నిర్వహణ తదితరాలను పరిశీలించారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు షోకాజు నోటీసులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో తాగునీరు, మురుగుకాలువలు, మౌలిక వసతులు కల్పించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఉన్నారు.

పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తాం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి


కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వాంకిడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలు కల్పిస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో శివచరణ్‌కుమార్‌లతో కలిసి పాఠశాల ఆవరణలో స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దీపక్ తివారి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమవసతి గృహాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఇందులో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఇందాని గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యత, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మీనా, కార్యదర్శి శివకుమార్, ఏఈ కిరణ్ తదితరులు ఉన్నారు.

మండల వాసికి బీజేపీ జిల్లా పగ్గాలు


దోని శ్రీశైలం

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దోని శ్రీశైలం నియామకం అయ్యారు. చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామపంచాయతీ పరిధిలోని దరంపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం బీజేపీ పార్టీ మండలాధ్యక్షుడి నుంచి జిల్లా అధ్యక్షుడిగా ఎదిగారు. 2018లో బీజేపీలో చేరి చింతలమానేపల్లి మండలాధ్యక్షుడిగా, 2021లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. శ్రీశైలం ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారు. ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ చురుగ్గా పనిచేశారు. ఆయనను పలువురు అభినందించారు.

వట్టివాగు ప్రాజెక్టు నీటి విడుదల


కాలువ ద్వారా దిగువకు వస్తున్న ప్రాజెక్టు నీరు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు నీటిని మంగళవారం అధికారులు విడుదల చేశారు. యాసంగి పంటల సాగు నేపథ్యంలో రైతుల కోరిక మేరకు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసినట్లు ఏఈ పవన్ తెలిపారు. కాలువ ద్వారా వదులుతున్న నీటిని రైతులు సద్వినియోగం చేసుకొని పంటలకు ఉపయోగించుకోవాలని సూచించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు, షీ టీం సభ్యులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భట్టుపల్లిలో మంగళవారం మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇచ్‌ఛార్జిలు రమాదేవి, సునిత మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలపై అన్యాయాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనురాధ, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.